

జాతర-
తోటకు పరిమళాల వసంతమొచ్చినట్లు-
వెన్నెలకు పరవశాల పున్నమొచ్చినట్లు-
రేపల్లెలాంటి ఆ చిన్న పల్లెకు అమ్మవారి జాతరొచ్చింది.

దాంతో ఒకటే సందడి. చుట్టుపక్కల గ్రామాల నుంచి ఉప్పెనలా ఆ పల్లెను ముంచేస్తుంది జన ప్రవాహం. ప్రతి ఇంటి గడప ముందు బంధు జనమే. ప్రతి ఇంట్లోనూ పసందుగా విందు భోజనమే. వీధిలోకి వస్తేచాలు గుండెలదరగొడుతూ డప్పుల వాద్యాలు.

జజ్జనకర జనారే! జనకుజన జనారే!!

ఆ డప్పులకనుగుణంగా అడుగులు కదుపుతున్న పులి వేషాలు. ఒకటే హుషారు.

తప్పెట్లు, తాళాలు.

రాత్రయితే ఇక దీపావళే.

రంగు రంగుల కాంతి తోరణాలతో

ఊరంతా సంక్రాంతే.

రెండుజెళ్ళ సీతలతో, కొంటె కోణంగులతో సరదాల దసరాయే!

అవును-

పండుగలన్నీ కూడబలుక్కుని ఒక్కసారిగా ఊరుమీదకు విరుచుకుపడితే దాని పేరే జాతర.

★ ★ ★ ★ ★

''ఒరేయ్! వంశీ, ఎక్కడకురా ఇంత రాత్రివేళ. నాన్నారితో చెబితే చాలు నీ తోలు వలిచేస్తారు. రా, ఇంటికి'' యశోదమ్మ కేకలేస్తోంది.

అయినా వంశీకృష్ణ వినిపించుకోలేదు. ఒక్క దౌడుతీసి వీధిలోకొచ్చాడు. ఆ బజారులో జాతర సందడి చూస్తుంటే అతడి కళ్లల్లో కోటి నక్షత్రాల వెలుగు.

''అబ్బ! ఎంత బాగుంది మా ఊరు'' అనుకున్నాడతడు.

''అమ్మకు బుద్ధిలేదు. ఎపుడూ చదువు, చదువు అంటుంది. ఇంత సందడి ఎదురుగా ఉంటే చదువు మీదకు ధ్యాస పోతుందా?'' అనుకున్నాడతడు.

అనుకోకుండా చెక్కిలిపై చేయివేసి తడుముకున్నాడు. చిన్న మొటిమ. బాల్యానికి వీడ్కోలు చెబుతూ కొత్తగా వస్తున్న కోడెవయసుకు తొలి .... చిన్నగా నవ్వుకున్నాడు వంశీ.

వంశీకృష్ణ- పదో తరగతి విద్యార్థి.

ఆ రాత్రి-

బాణసంచా కాల్చారు. రంగురంగుల వెలుగు రవ్వలు ఆకాశ వీధిలో రంగవల్లికలను తీర్చిదిద్దుతుంటే అచ్చెరువొందాడు వంశీ.

అంతకంటే అతడిని ఆశ్చర్యపరచింది యామిని.

వసంతయామిని.

ఆ రాత్రంతా అతడు నిద్రపోలేదు.

★ ★ ★ ★ ★

''యామిని'' ఆ అక్షరాలను ప్రణవాక్షరాలలా పలికించాడు వంశీకృష్ణ. ఆమని తెచ్చిన కొత్త పూల గాలికి లలిత లలితంగా వయ్యారాలొలికే తీగెలా ఆమె అతడి కళ్లముందు కదలాడుతోంది.

ఎత్తయిన కొండలమీద ఉరుకులు, పరుగులతో రమణీయ జలపాతంలా ఆమె అతడి హృదయాలలోకి ప్రవహిస్తుంది. 'యామిని' పెదవుల కంపనలు ఆమె పేరే.

ఆ ధాత్రి బాణ సంచా కాల్చిన తర్వాత సాంస్కృతిక ప్రదర్శన ప్రారంభించారు. నిజానికది సాంస్కృతిక ప్రదర్శన కానేకాదు. ఓ రికార్డింగ్ డాన్స్. అప్పుడే చూశాడు వేదికపై యామినిని వంశీ.

పచ్చని శరీరచ్ఛాయ. విశాల నేత్రాలు. అరుణిమలొలికే జంకు పెదవులు. ఒంపుగా వంపులు తిరిగి చుబుకం, శంఖాకారపు మెడ-

ఆ కిందికి చూపు సారిస్తే ఆమె కదిలితే చాలు ఉవ్వెత్తున ఎగిసిపడే పంజరం నుండి ఎపుడెప్పుడు బయటపడదామా అని తపించే ఎదపొంగులు-

నడుం దగ్గర చక్కటి ఓ మెలిక.

...... సౌందర్య అప్సరస ఆమె- యామిని. వంశీ కనురెప్పలు వాల్చడం మర్చిపోయాడు. స్త్రీని- అంత అందమైన స్త్రీని, కుబుసం విడిచిన నాగులాంటి ఆడదాన్ని అంత దగ్గరగా అదే మొదటిసారి చూడడం. మరుగుతున్న ఉష్ణకాసారంలా అతడి శరీరం. పరిమళాల శీతల స్పర్శల్లా తగిలే ఆమె చల్లని చూపులు. పదే పదే గుర్తుకొస్తుంది వంశీకి ఆమె.

★ ★ ★ ★ ★

శూన్యం.

రెక్కలొచ్చిన గువ్వ ఎగిరిపోతే ఒంటరి గూడులాంటి భయానక శూన్యం. ఊహకందని వేదనతో తలమునకలవుతున్నాడు వంశీ. వేసవిలో ఎండిపోయిన పిల్లయేరులా ఊరు మారిపోయింది. జాతర జరిగిన రహదార్లు, డప్పులు మోగిన ప్రదేశం, యామిని నృత్యం చేసిన వేదిక, కొత్తగా దుకాణాలు వెలసిన చోటు-

ఎటుచూసినా వంశీకి నైరాశ్యమే.

శూన్యమే.

వాసంత సమీరానికి మైమరచి గాన కచేరి చేసిన కోకిలల గుంపు ఒక్కసారి వలస వెడితే ఎలా ఉంటుందో సరిగ్గా అలావుంది వంశీ పరిస్థితి. మళ్లీ జాతర ఎపుడొస్తుంది?

'అబ్బ! ఏడాదికే, అంతదాకా యామినిని చూడకుండా ఉండగలనా?'

నిస్పత్తువ.

★ ★ ★ ★ ★

''వంశీ'' గుసగుసగా పిలుపు. అంతలోనే ఓ పేపర్ రాకెట్ విసురుగా వచ్చిపడింది అతడి టేబుల్‌పై.

తెలుగు క్లాసు జరుగుతోంది. వెనక్కి తిరిగి చూశాడు వంశీ. శ్రీకాంత నవ్వుతున్నాడు.

వెంటనే పేపర్ రాకెట్ వేపు చూశాడు.

''రాత్రి యామిని ప్రోగ్రాం వస్తావా?''

ఒక్కసారిగా వంశీలో నూతనోత్తేజం.

కళ్లు కాంతి పుంజాలయ్యాయి.

''ఎక్కడ?''

''పక్క ఊర్లో, కొత్తమ్మవారి జాతర''

''వస్తా!'' చెప్పాడు వంశీ. ఇప్పుడతడి దృష్టి చదువుపై లేదు. అక్షరాలపై అసలు లేదు. యామిని కాలి అందెల కదలికలపైనే ఉంది.

పాటపాటకి డ్రెస్ మారుస్తూ మెరుపు తీగలా కదులుతూ యవ్వన చైతన్యాన్ని దోసిటనిండా పంచి ఇచ్చే యామిని కదలాడుతుంది ప్రతి అక్షరంలోనూ.

అతి కష్టం మీద క్లాసయిందనిపించాడు.

ఆ తర్వాత శ్రీకాంత్‌ని కలిసి అడిగాడు.

-ఎంత దూరం?

''మూడు మైళ్లు. సైకిల్‌పై పోదాం''

''సరే''

పబ్లిక్ పరీక్షలకు కంబైండ్ స్టడీస్ పేరుతో బయటకొచ్చాడు వంశీ.

ఇద్దరు బయలుదేరారు.

చిక్కని చీకటి రాత్రి. దారి సరిగా కనిపించడంలేదు. ఎగుడు దిగుడు రహదారిలో అక్కడక్కడా రాళ్లు, గోతులు. నిజానికి వంశీకి చీకటంటే మహా భయం. అర్థరాత్రి తోడులేకుండా పెరట్లోకి కూడా వెళ్లడు. ఆకాశంలో చుక్కల వెలుగు. అక్కడక్కడా మిణుగురుల కాంతి.

తొక్కుతున్నాడు వంశీ సైకిల్‌ని అతి కష్టంగా.

''ఇంకా ఎంత దూరం రా?'' అడిగాడు వంశీ- ఆయాసంతో రొప్పుతూ.

''వచ్చేసింది ఇంకెంత దూరం ఫర్లాంగే'' అన్నాడు శ్రీకాంత్. అతడు ఏదో సినిమా కబుర్లు చెబుతూ ఉత్సాహంగానే తొక్కుతున్నాడు. వంశీ మాత్రమే తన సైకిల్ తొక్కలేక అలసిపోతున్నాడు. నుదుటి మీద ధారాపాతంగా చెమట.

ఎక్కడో నక్క ఊళ భీకరంగా.

ఒక్కసారి బెదిరిపోయాడు వంశీ. సైకిల్ పట్టు తప్పింది. రోడ్డు దాటి పెద్దరాయిని ఢీకొంది.

అంతే!

''అమ్మా'' కెవ్వున కేక. ముందుకెళ్లిపోతున్న శ్రీకాంత్ ఆగి వెనక్కివచ్చి చూశాడు.

వంశీ గోతిలో పడ్డాడు.

''ఏమైంది?'' నెమ్మదిగా లేచి నిలుచున్నాడు వంశీ. తలపై సన్నగా బొప్పి, చేత్తో తాకి చూస్తే తడి. ''అమ్మో! రక్తం''.

సైకిల్ తీసి వంకరపోయిన హేండిల్ సరిచేస్తూ అడిగాడు శ్రీకాంత్- ''వంశీ! ఈ దెబ్బతో ఇప్పుడొస్తావా?''

''నువ్వు?''

''నేను ఖచ్చితంగా యామిని డాన్స్, చూస్తాను. ఆమె ఎవరు? నా గుండెల్లో గూడుకట్టుకున్న దేవత''

★ ★ ★ ★ ★

గుండెల్ని కోస్తూ తీపి బాధను గురిచేస్తూ వినిపిస్తోంది ఓ సినీ గీతం. స్టేజిపై యామిని పాటకు అనుగుణంగా నర్తిస్తుంది. వంశీలో కట్టలు తెంచుకున్న ఉద్రేకం- ఇందాకటి గాయంకన్నా అధికంగా. మూడు నిముషాల గీత మాధుర్య ముగిసింది. కాసేపు విరామ నరకం. మళ్లీ అంతలోనే స్వర్గపు అంచుల్లోకి తేలుతూ వెడుతూ యామిని సౌందర్య దర్శనం.

''కరెన్సీ విసిరేస్తే చాలు యామిని కౌగిట్లో వాలుతుంది'' ఎవరో అంటున్నారా మాటని.

ఒక్కసారిగా వంశీ లేచాడు ''ఇప్పుడే వస్తా'' అంటూ వెళ్లిపోయాడు.

శ్రీకాంత్‌కి అర్థం కాలేదు వంశీ.

ఎక్కడకు వెళ్లాడో?

★ ★ ★ ★ ★

కట్టలు తెంచుకున్న గోదారి వరదలా ముందుకు దూకుతు పోయాడు వంశీ. కార్యకర్తలు అడ్డగించినా ఆగలేదతడు. 'గ్రీన్ రూం'గా ఆర్టిస్టులు భావించే తడికల చాటుకు వేగంగా దూకుతు పోయాడతడు.

''ఎవరూ?'' ఉలిక్కిపడింది యామిని.

''మీతో మాట్లాడాలి'' అప్పుడతడిని తేరిపార చూసిందామె. పసితనం వాడని ముఖం. కొత్తగా వస్తున్న మీసకట్టు. బాల్యానికి యవ్వనానికి మధ్య మలుపులో నిలుచున్నాడతడు.

''ఎవరు, బాబూ?''

సరిగ్గా అపుడే చూసింది యామిని వంశీ తలపై గాయాన్ని.

''నాకు నువ్వు కావాలి. ఎంత డబ్బయినా ఫర్వాలేదు. నువ్వు కావాలి. నిన్నిలా చూస్తుంటే నాకు పిచ్చెక్కుతోంది. నీతోటే ఉండాలనిపిస్తుంది. ప్లీజ్'' అతడి కళ్లలో హిమపాతం.

సౌందర్య తుఫానులో చిక్కుకుని చిగురుటాకులా వణికిపోతున్నాడు.

''ఇపుడు నీ దగ్గరే కదా ఉన్నాను''

''ఊహూ! ఇలా కాదు''

''మరెలా?''

తొలిసారిగా స్త్రీని అర్ధనగ్నంగా అతి దగ్గరగా చూసిన తొలి యవ్వనంలో తుపానులాంటి తెలీని కోర్కె అతనిలో జనిస్తోంది. కాని ఆ కోర్కె వివరించే వయసే ఇంకా అతడికి రాలేదు.

''నిన్ను చూడాలని మూడు మైళ్లు సైకిల్‌పై వచ్చాను. దారిలో పడిపోయాను. తెలుసా?''

అతడికి యామిని అపరిచితురాలిలా కన్పించలేదు. ఎన్నో యుగాలుగా జట్టుకట్టిన నేస్తమల్లే కనిపిస్తుంది. ఆమె నుంచి సాంత్వన పొందాలని, ఆమె సమక్షంలో కాలక్షేపం చేయాలని అతడి ఊహ.

యామిని తన చీరకొంగు చింపి వంశీ గాయానికి కట్టు కట్టింది. ఆమె కళ్లముందు కిషోర్ కదిలాడు.

కిషోర్- ఆమె తమ్ముడు. సరిగ్గా వంశీ వయసే. చిన్నప్పుడే తల్లిదండ్రి చనిపోతే ఆదుకునేవారు లేక అనాథమైన తమని చూసి లోకం పరిహసించింది. ఫలితం- పాప పంకిలంలో పద్మంలా తను. ఎక్కడో దూరంగా హాస్టల్లో విద్యార్థిగా కిషోర్.

ఆమె కళ్లు చెమర్చాయి.

వంశీని దగ్గరకు తీసుకుంది యామిని. ఆమె గుండెలో గువ్వపిట్టలా ఒదిగిపోయాడతడు. తలెత్తి తన చేతి బంగారు ఉంగరాన్ని చూపిస్తూ- ''కావాలంటే ఇది తీసుకో! నన్ను నీ దగ్గరే ఉండనివ్వు''

-అంతే!

ఆమె దూరంగా నెట్టేసింది.

''చూడు- నువ్వెవరో నాకు తెలీదు. కాని కసుకాయల్ని చిదిమేసే కర్కసురాల్ని కాను. నీకు మంచి భవిష్యత్తు ఉంది. నా తమ్ముడికి నే చెప్పేది ఇదే.'' ఆగింది యామిని. వంశీ నోట మాట రాలేదు.

''వెళ్లు'' అంది యామిని. అతడి కళ్లలో సుడులు. అంతలోనే పిలిచింది యామిని. తర్వాత దగ్గరగా వచ్చి అతడి చెక్కిలిపై గట్టిగా ముద్దు పెట్టుకుంది-'ఇదే నా తమ్ముడికి ఇచ్చే అపురూపమైన కానుక''

నిద్రలో నడుస్తున్నవాడిలా నెమ్మదిగా బయటకు నడిచాడు వంశీ.

ఆమె వెచ్చని ఊపిరి గుసగుసలాడుతున్న సవ్వడి.

చెక్కిలిపై ఆరిపోని తడి ముద్దు.

★ ★ ★ ★ ★

''డ్రైవర్, కారాపు''

కారాగింది- అతడు దిగాడు. డ్రైవర్ ఆశ్చర్యంగా చూస్తున్నాడు అతడెక్కడికి వెడతాడా అని. పేవ్‌మెంట్ మీదకు వచ్చాడతడు.

అక్కడ మృత్యువుతో పోరాడుతున్న ఓ స్త్రీ. నెమ్మదిగా వంగి చూశాడామెని అతడు.

ఆమె బరువుగా కనురెప్పలు విడదీసి చూపుల్ని పెరిగించింది అతి కష్టం మీద.

''ఎవరూ?'' అది ఆమె ప్రశ్న.

''నేను... నువ్వు కావాలి''

ఆమెలో ఆశ్చర్యం.

అతడు చెబుతున్నాడు-''నిన్ను నే మరువలేదు. ఎక్కడ ఏ జాతరలో డప్పు మోగినా చప్పున గుర్తొచ్చే దానివి. పూల తీగని చూసినా, జలపాతాన్ని చూసినా నీవే జ్ఞప్తికి వచ్చేదానివి.''

తర్వాత అంది-''నేను నీరుపోసి పెంచిన చిన్నమొక్క నాకంటే ఎత్తుకే ఎదిగిపోయింది. ఆ ఎత్తుని అందుకోలేని నేను...''

''ప్లీజ్! ఇంకేం మాట్లాడకు. నేను నీ స్ఫూర్తితో పెరిగిన మొక్కనే. ఇక్కడ ఈ చెక్కిలిపై ఆ ముద్దు తడి ఇంకా ఆరలేదు. రా! నాతో రా! రహదారి పక్కన దిక్కులేని దీపానివి కారాదు. ఊపిరున్నంతవరకూ నా కళ్ళలో కాంతివి కావాలి నువ్వు.

తర్వాత 'డ్రైవర్' అని పిలిచాడతడు.

పరుగున వచ్చాడు డ్రైవర్- ''ఈ డాక్టర్‌కి ఏమైనా పిచ్చా! పిచ్చివాళ్లను బాగుచేసి చేసి ఇతనికి మతికానీ పోయిందా?'' అనుకున్నాడు డ్రైవర్.

డ్రైవర్ ఒక చేత్తో అతడొక చేత్తో ఆమెను ఎత్తుకొని కారువేపు రాసాగారు.

ఇప్పుడు అతడి గుండెల్లో జాతర చప్పుడు.